

అమలులోకి ఎన్నికల కోడ్

పార్వతీపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన వెంటనే కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికిరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మోగిన ఎన్నికల నగారా



- షెడ్యూల్ విడుదల ● ఏప్రిల్ 18న నోటిఫికేషన్
- మే 13న పోలింగ్.. జూన్ 4న ఓట్ల లెక్కింపు

పార్వతీపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగింది. లోక్‌సభతో పాటు శాసన సభ ఎన్నికల తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. దీంతో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చేసింది. మొత్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏపీ విషయానికొస్తే.. ఫేజ్-4లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 18న ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే నెల 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 26న నామినేషన్ల పరిశీలిస్తారు. 29తో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగుస్తుంది. మే13న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు ఒకేసారి పోలింగ్ నిర్వహిస్తారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. కాగా జిల్లాలో అరకు పార్లమెంట్ స్థానానికి, పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం అసెంబ్లీ నియోజకవర్గాలకు మే 13 ఎన్నికలు జరుగునున్నాయి. మొత్తంగా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 7,77,733 మంది ఓటర్లు ఉన్నారు. వారంతా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్‌కు 57 రోజుల వ్యవధి ఉండడంతో.. ఈసారి రాజకీయ పార్టీల నేతల ప్రచారాలకు ఎక్కువ సమయం లభించింది. అన్ని ప్రధాన పార్టీల రాష్ట్ర నాయకులు.. ఆపై అభ్యర్థుల సభలు.. సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఉంది. కాగా జిల్లాలో టీడీపీకి సంబంధించి పాలకొండ నియోజకవర్గానికి, ఎంపీ స్థానానికి అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది.

ఏపీ, ఒడిశాలో ఒకే రోజు పోలింగ్

- మీమాంసలో కొఠియా ఓటర్లు

సాలూరు రూరల్, మార్చి 16: ఏపీ, ఒడిశాలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికలను తేదీలను ప్రకటించింది. ఇంత వరకు బాగానే ఉన్న కొఠియా గ్రామస్థులకు ఈ ఎన్నికలు పరీక్షలా నిలిచాయి. కొఠియా గ్రూప్‌లో 21 గ్రామాలు ఏపీ, ఒడిశా రాష్ట్రాల మధ్య వివాదంలో ఉన్నాయి. వాటిపై 1968, డిసెంబరు నుంచి సుప్రీంకోర్టు స్టేటస్ కో ఉంది. ఈ గ్రామాలకు సంబంధించి ఇరు రాష్ట్రాలు అసెంబ్లీ, లోక్‌సభ, పంచాయతీ, పరిషత్ ఎన్నికలను నిర్వహించుకుంటునే వస్తున్నాయి. అయితే ఆయా ఎన్నికలు వేర్వేరు తేదీల్లో జరగడంతో ఇప్పటివరకు ఎటువంటి ఇబ్బంది రాలేదు. ప్రస్తుతం ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్‌లో ఏపీ, ఒడిశాలో ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఈ షెడ్యూల్ ప్రకారం సాలూరు అసెంబ్లీ, అరకు లోక్‌సభ స్థానానికి మే 13న పోలింగ్ జరగనుంది. వీటి పరిధిలో ఉన్న కొఠియాకు చెందిన 21 గ్రామాలకు సంబంధించి 4,800 మంది ఓటర్లు ఉన్నారు. వారికి శిఖపరువు, డొంకల వెలగవలస, నేరేళ్లవలస తదితర పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. కొఠియా ఓటర్లకు మరో సమస్య వచ్చింది. అదే రోజున పొట్టంగి అసెంబ్లీకి, కోరాపుట్ లోక్‌సభ స్థానానికి పోలింగ్ జరగనుంది. వీటి పరిధిలో సైతం కొఠియా గ్రూప్ గ్రామాలున్నాయి. కొఠియా తదితర చోట్ల పోలింగ్‌కు ఒడిశా ఏర్పాట్లు చేసింది. ఒడిశా జాబితా ప్రకారం కొఠియా పంచాయతీలో దాదాపు 8000 మంది ఓటర్లు ఉన్నట్టు భోగట్టా. మొత్తంగా ఒకే రోజు ఇరు రాష్ట్రాల్లో కొఠియా గ్రామాలకు సంబంధించి పోలింగ్ జరగనుండడంతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశముంది. పోలింగ్ వెళ్లిన ఓటరు చేతికి ఇంకు ముద్ర వేయడం నిబంధన. అయితే కొఠియా ఓటరు ముందుగా ఒడిశా వెళ్లి ఓటు వేస్తే అక్కడ ఇంకు ముద్ర వేస్తారు. ఆ తర్వాత వారు ఏపీకి వచ్చి ఓటు వేయడానికి యత్నిస్తే.. చేతికి ఇంకు ముద్ర ఉందని అడ్డు చెప్పే అవకాశముంది. ఏపీకి ముందుగా వచ్చి ఓటు వేస్తే ఒడిశా అధికారులు కూడా ఇదే విధంగా అభ్యంతరం చెప్పే అవకాశముంది.

అప్పట్లో ఇదే సమస్య..

1996 పార్లమెంట్ ఎన్నికల్లో ఇదే విధమైన సమస్య వస్తే.. అప్పటి జిల్లా కలెక్టర్ పూనంమాలకొండయ్య, కోరాపుట్ కలెక్టర్‌తో చర్చించి.. ఓటర్ల వేళ్లకు వేర్వేరు ఇంకు ముద్ర వేసేలా చూశారని కొందరు చెబుతున్నారు. ఇది నిజమో.. కాదో అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటే కొఠియా వాసులు సజావుగా ఓటు వేసుకునే అవకాశముంటుందని పరిశీలకులు అంటున్నారు.



కొఠియా గ్రామం

పోలింగ్ దూరం.. ఖర్చు భారం

విజయనగరం(ఆంధ్రజ్యోతి), మార్చి 16: సార్వత్రిక ఎన్నికలు ఏపీలో మొదటి దశలో జరిగే అవకాశం ఉందని అంతా భావించారు. ఆ ప్రకారం ఏప్రిల్ మూడోవారంలో పోలింగ్ ఉంటుందనుకున్నారు. వీరొకలా భావిస్తే ఎన్నికల సంఘం మరోలా తలచింది. సుమారు 2 నెలల దూరం పెంచుతూ షెడ్యూల్ ప్రకటించింది. దీంతో శనివారం ఎన్నికల సందడి మొదలైంది. అయితే పోలింగ్ వరకూ అనుచరులు, కేడర్‌ను నిరంతరం సంప్రదిస్తూ అసంతృప్తులను దారికి తెస్తూ అందరినీ ఒకే మాటపై నిలబెట్టేందుకు చాలా శ్రమించాల్సి వస్తుందని, ఖర్చు తడిసిమోపెడవుతుందని అభ్యర్థులు కలవరపడుతున్నారు. గతంలో కంటే ఖర్చు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. శనివారం నుంచి మే 13 అంటే సుమారు 57 రోజులు సమయం ఉంది. గ్రామాల్లో జాతర్లు, పండగలు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు, దేవాలయాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో అభ్యర్థులు పాల్గొనాల్సి వస్తుంది. అదే సమయంలో కానుకలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇవి కాక ఎన్నికల లెక్కల్లోకి వచ్చే మైక్‌సెట్, వాహనాలు, జెండాలు, కండువాలు తదితర ఖర్చులు ఉండనే ఉన్నాయి. అందుకే పోలింగ్ దూరం.. ఖర్చు భారమంటూ అభ్యర్థులు నిట్టూర్చుతున్నట్లు సమాచారం.

లక్షయినా లెక్క చెప్పాల్సిందే..

విజయనగరం (ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చాయి.. దాదాపు రెండు నెలల పాటు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో వుండనుంది. ఎటువంటి ప్రలోభాలకు తావివ్వకుండా నిర్భయంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఈసీ చెబుతోంది. రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభపెట్టాలని చూస్తే అందుకు తగిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎన్నికల నిబంధనలు రాజకీయ నాయకులపై ప్రభావం ఎలా ఉన్నా, సామాన్య, మధ్యతరగతి ప్రజలకూ కొన్ని ఇబ్బందులు తప్పవు. ఎన్నికల అభ్యర్థులైతే రూ.50 వేలు తీసుకువెళ్లినా లెక్కచెప్పాల్సిందే. అదే సామాన్యుల లక్ష రూపాయలతో పట్టుబడితే అందుకు తగిన పత్రాలు, వివరాలను పోలీస్, ఎన్నికల అధికారులకు చూపాలి. కాగా మార్చి, ఏప్రిల్, మే నేలల్లో శుభకార్యాలు, వివాహాది కార్యక్రమాలు ఉన్నాయి. ఒకవైపు పెళ్లిళ్ల, మరోవైపు జాతర్లలో బిజీగా వుండే ప్రజలు ఎన్నికల నిబంధనలు మరిచిపోయి నగదుతో ప్రయాణిస్తే ఇబ్బందులు తప్పవని అధికారులు చెబుతున్నారు.

- బంగారం, వస్త్రాలు , గిఫ్ట్ ఆర్టికల్స్, స్పోర్ట్స్ కిట్స్ , టోకుగా బంగారం, వెండి, వస్త్రాలు తదితర వాటిని తీసుకెళ్లినా సరే తగిన పత్రాలు ఉండాలి.



- భూముల కొనుగోళ్ల, రిజిస్ట్రేషన్ వంటి సమయాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అప్రమత్తంగా వుండాలి.

ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలీసులు నిఘా పెట్టారు. విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. కార్లు, జీపులను చెక్ చేస్తున్నారు.

ఆన్‌లైన్ ఖాతాలపైనా నిఘా..

ప్రస్తుత రోజుల్లో ఆన్‌లైన్ లావాదేవీలు ఎక్కువగా జరుపుతున్నారు. వాటిని సాధారణ రోజుల్లో పెద్దగా పట్టించుకోరు. ఎన్నికల సమయం కావడంతో బ్యాంక్ ఖాతాలపై కూడా అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో ఖాతాలో జమ అయిన నగదు ఎక్కడ నుంచి వచ్చింది. ఎవరి ఖాతాకి వచ్చింది.. తదితర వివరాలపై నిఘా పెడుతున్నారు. అనుమానం వచ్చిన వ్యక్తి లావాదేవీల వివరాలు కూడా సేకరించే అవకాశం ఉంది.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం: కలెక్టర్

పార్వతీపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 18 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో మాట్లాడుతూ.. వచ్చేనెల 30 వరకు 66 కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. క్యూఆర్ కోడ్‌తో ప్రశ్నపత్రాలు ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. మొత్తంగా టెన్త్ పరీక్షలకు 5,124 మంది బాలురు, 5,410 మంది బాలికలు హాజరవుతారని చెప్పారు. గతంలో ఉత్తీర్ణతగాని 664 మంది విద్యార్థులు కూడా హాజరవుతారన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించామని, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు మార్చి 18 నుంచి 26వ తేదీ వరకు 12 కేంద్రాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని, 712 మంది విద్యార్థులు హాజరవుతారన్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, డీఈవో జి.పగడాలమ్మ, ఇతర శాఖల అధికారులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సిట్టింగులకే సీట్లు

- వైసీపీ అభ్యర్థులంతా పాతవారే.. ● ప్రస్తుత ఎమ్మెల్యేలకే మళ్లీ అవకాశం

పార్వతీపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సిట్టింగు ఎమ్మెల్యేలకే వైసీపీ మళ్లీ సీట్లు ఇచ్చింది. మరోసారి పోటీ చేసే అవకాశం కల్పించింది. ఈ మేరకు శనివారం ఆ పార్టీ అధిష్ఠానం అభ్యర్థుల జాబితా ప్రకటించింది. సాలూరు నుంచి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పార్వతీపురం అభ్యర్థిగా అలజంగి జోగారావు, కురుపాం నుంచి పాముల పుష్పశ్రీవాణి, పాలకొండ అభ్యర్థిగా విశ్వసరాయి కళావతి ఎన్నికల బరిలో నిలవనున్నట్లు తెలిపింది. దీంతో రాజన్నదొర ఐదోసారి, అలజంగి జోగారావు రెండోసారి, పుష్పశ్రీవాణి, కళావతి మూడోసారి ఎన్నికల సమరానికి సన్నద్ధమవుతున్నారు. ఇకపోతే అరకు ఎంపీ స్థానానికి సంబంధించి ఎస్.తనూజారాణికి వైసీపీ అధిష్ఠానం టిక్కెట్ ఇచ్చింది.



ప్రసన్నకు నిరాశ

రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్ ఆశలపై వైసీపీ అధిష్ఠానం నీళ్లు చల్లింది. ఈ సారి టిక్కెట్ వస్తుందనుకున్న ఆయనకు నిరాశే ఎదురైంది. గత ఎన్నికల్లో పార్వతీపురం నుంచి వైసీపీ అభ్యర్థిగా ప్రసన్నకుమార్ పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల ముందు ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే జోగారావుకు టిక్కెట్ కేటాయించారు. దీంతో అప్పట్లో ప్రసన్నకుమార్‌తో పాటు ఆయన వర్గం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ స్వయంగా కల్పించుకుని 2024 ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తానని ప్రసన్నకు మాటిచ్చారు. జోగారావును గెలిపించాలని హితబోధ చేశారు. కాగా శనివారం వైసీపీ అధిష్ఠానం పార్వతీపురం నియోజకవర్గం నుంచి మరో సారి పోటీ చేసే అవకాశాన్ని అలజంగి జోగారావుకు కల్పించడంతో ప్రసన్నకుమార్ వర్గం ఒక్కసారిగా షాక్‌కు గురైంది. ఏదేమైనా ఇరు వర్గాల మధ్య రాజకీయ విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో గతంలో మాదిరిగా జోగారావుకు అనుకూలంగా పనిచేస్తారా లేక ప్రసన్నకుమార్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది. మరోవైపు ప్రసన్న వర్గీయులు టీడీపీలో చేరాలని యోచిస్తున్నారు.

వలంటీర్లకు తాయిలాలు

- నగదు, దుస్తులు పంపిణీ



అధికార పార్టీ నాయకులు తాయిలాలతో వలంటీర్లకు ఎర వేస్తున్నారు. నగదు, దుస్తులు పంపిణీ చేస్తూ.. వచ్చే ఎన్నికల్లో తమకు సహకరించాలని కోరుతున్నారు. శనివారం పాలకొండ-రాజాం రోడ్డులోని అన్నవరం సమీపం లోని ఓ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ చేపట్టినట్లు తెలిసింది. పాలకొండ మండలంతో పాటు పట్టణంలోని ఎంపిక చేసిన వలంటీర్లను పిలిచి రూ.ఐదు వేలతో పాటు వారికి దుస్తులను అందజేశారు. వైసీపీ విశ్వాసపాత్రులను గుర్తించి వారికి ఈ తాయిలాలు ఇచ్చినట్టు సమాచారం. ఇదిలా ఉండగా కల్యాణ మండ పంలోకి వలంటీర్లు మొబైల్ ఫోన్లు తీసుకురాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ తాయిలాల పంపిణీ కార్యక్ర మంలో వలంటీర్లతో పాటు పలువురు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

- పాలకొండ

విగ్రహానికి ముసుగేశారు.. జెండా మరిచారు!



అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు శనివారం షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో అధికార యంత్రాంగం ఎన్నికల నియమావళిని అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా సాలూరు మండలం మామిడిపల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ముసుగు వేశారు. అయితే దాని పక్కనే ఉన్న వైసీపీ జెండాను మాత్రం అధికారులు తొలగించలేదు. దీంతో పార్టీ జెండాలకు కోడ్ వర్తించదా? దీనిపై అధికారులు సమాధానం చెప్పాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా సాలూరు మున్సిపల్, రూరల్ పరిధిలో పలు చోట్ల వివిధ పార్టీలకు చెందిన బ్యానర్లు దర్శనమిచ్చాయి. బహుశా ఆదివారం వాటిని తొలగిస్తారేమో మరి.. వేచి చూడాల్సి ఉంది.

- సాలూరు రూరల్

తగ్గించలేదెందుకో?

- పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్రం తగ్గించినా.. రాష్ట్ర ప్రభుత్వం ససేమిరా!
- ఐదేళ్లలో ఒక్కసారిగా కూడా స్పందించని వైసీపీ
- మండిపడుతున్న వాహనదారులు

సాలూరు రూరల్, మార్చి 16: పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.2 చొప్పున తగ్గిస్తూ.. ఇటీవల కేంద్ర సర్కారు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించ డానికి ముందు ఈ ప్రకటన వెలువడగా.. వాహనదారులకు మాత్రం కాస్త ఉపశమనం లభించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వాటిపై పన్నులు తగ్గించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాహనదారులు సైతం మండిపడుతున్నారు. పెట్రో ధరల అదుపునకు ఏపీ, తెలంగాణ, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాలు తమ పన్నులను తగ్గించుకోవాలని 2022 మేలో ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. గతంలో కేంద్ర ఆర్థికశాఖామంత్రి నిర్మల సీతారామన్ కూడా సూచించారు. కాగా 22 నెలల వ్యవధిలో కేంద్రం మూడుసార్లు పెట్రో ధరలను తగ్గించింది. అయినా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కసారి కూడా పెట్రోల్, డీజిల్‌లో పన్నులను తగ్గించకపోవడంపై వాహనదారులు, ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సాలూరు పెట్రోల్ బంకులో వాహనదారులు ఇలా..



వాస్తవంగా 2021 నవంబరు 4న కేంద్ర సర్కారు లీటర్ పెట్రోల్‌పై రూ. 5, లీటర్ డీజీల్‌పై రూ. 10 కేంద్రం ఎక్సైజ్ డ్యూటీని తగ్గించింది. 2022, మే 22న లీటర్ పెట్రోల్‌కు రూ.9.52, డీజీల్‌కు లీటర్‌కు రూ. 7.38 తగ్గించింది. తాజాగా కేంద్రం నిర్ణయంతో పన్నులతో కలిపి ప్రస్తుతం లీటర్ పెట్రోల్‌కు రూ. 2.19, లీటర్ డీజిల్‌కు రూ. 2.10 మేర తగ్గింది. మొత్తంగా జిల్లాలో లీటర్ పెట్రోల్ ధర రూ. 111.76 నుంచి రూ. 109.57కు, డీజిల్ లీటర్ ధర రూ. 99.46 నుంచి రూ. 97.36కు దిగి వచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలో నెలకు దాదాపు రూ.1.48 కోట్ల మేర వినియోగదారులకు ఆదా కానుందని పెట్రో వ్యాపార వర్గాలంటు న్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం కూడా పెట్రో పన్నులను తగ్గిస్తే వాటి ధరలు మరింత తగ్గనున్నాయి. అంతే కాదు రవాణా చార్జీలు, నిత్యావసరాల ధరలు కూడా తగ్గనున్నాయి. ప్రస్తుతం మన రాష్ట్రంలో పెట్రోల్‌పై 31 శాతం వ్యాట్, లీటరుకు రూ.4 అదనపు వ్యాట్, రూ. 1 రోడ్డు అభివృద్ధి సెస్ ఉంది. డీజీల్‌పై 22. 25 శాతం వ్యాట్, లీటర్‌కు అదనపు వ్యాట్ రూ.4, రూ.1 రోడ్డు అభివృద్ధి సెస్ వసూలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం పన్నులు తగ్గించినా ఈ ధరలు మరింత కిందకు దిగి వచ్చేవని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా రవాణా ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలు కూడా తగ్గేవని అంటున్నారు.

తగ్గించి ఉంటే..

పెట్రో ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ తగ్గించడం మంచిదే. రాష్ట్ర ప్రభుత్వం కూడా పెట్రో పన్నులను తగ్గించి ఉంటే. ధరలు మరింత తగ్గేవి. రవాణా ఖర్చులు తగ్గి నిత్యావసర సరుకు ధరలు సైతం దిగి వచ్చేవి. ప్రజలు, రైతులకు ఉపయోగం కలిగేది.

- డబ్బి కృష్ణ, సాలూరు

పన్నుల భారం పడకుండా..

కేరళ మాదిరిగానే ఏపీలోనూ పెట్రో పన్నులను తగ్గించాలి. వాహనదారులపై ఆ భారం పడకుండా చూడాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పన్నులు తగ్గిస్తే పెట్రోల్, డీజీల్ ధరలు మరింత దిగి వచ్చేవి.

- ఎన్‌వై నాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

వైసీపీని సాగనంపుదాం

● ప్రజలకు టీడీపీ, జనసేన అభ్యర్థుల పిలుపు
● గ్రామాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీడీపీ, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రజలకు పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించి, సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. కూడమి విజయానికి కృషి చేయాలని కోరారు.

నిరంకుశ పాలనకు చరమ గీతం పాడాలి

గరుగుబిల్లి: రాష్ట్రంలోని నిరంకుశ పాలనకు ప్రజలు చరమ గీతం పాడా లని కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి కోరారు. శనివారం ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్నగుడి సముదాయంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన సందర్భంగా టపాసులు కాల్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో కార్యకర్తల్లో ఉత్సాహం మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, ముదిలిబాబు విజయ వాంకుశం, ఎ.రాంబాబు, ఎం.నారాయణస్వామి, బి.వెంకటి, కె.అరుణ్‌కుమార్, వి.దివాకర్, వెంపటాపు భారతి పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

శివ్వాం పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు శనివారం టీడీపీలో చేరారు. కురుపాం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి వీరికి పార్టీ కండువాలు కప్పి, ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్‌లు పి.పాపినాయుడు, పద్మావతి, సర్పంచ్ ప్రతినిధి ఆర్.పెంటయ్యతో పాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధులు మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, రాంబాబు, పూర్ణచంద్రరావు, యడ్ల శ్రీనివాసరావు, వి.దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని బంగాళాఖాతంలో కలపాలి

సాలూరు రూరల్: రాష్ట్రాన్ని ధ్వంసం చేసిన వైసీపీని బంగాళాఖాతంలో కలపాలని టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ప్రజలకు పిలుపునిచ్చారు. శివరాంపురం నుంచి శనివారం ప్రచార రథంతో ప్రచారాన్ని ప్రారంభించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వైసీపీ పాలనపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల



సాలూరు రూరల్: ప్రచారం చేస్తున్న సంధ్యారాణి

పరమేశు, శ్యాం, భాస్కరరావు, బాలాజీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● **మెంటాడ:** ఏపీ భవిష్యత్తు చంద్రబాబుతోనే మారనుందని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి అన్నారు. జీటీ పేటలో శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు చలుమూరి వెంకట్రావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని, ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. ● జీటీపేటలో మాజీ ఎంపీటీసీ చింతాడ అప్పలనరసమ్మ, పంచాయతీ వార్డు మెంబర్ దాకారపు సత్యం తోపాటు 200 మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. జయతి గ్రామానికి చెందిన చాపాన నారాయణరావుతో పాటు 30 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి సంధ్యారాణి పార్టీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు సీహెచ్ వెంకటరావు, అన్నవరం, ముసలినాయుడు, రెడ్డి ఆదినారాయణ, అనిల్‌కుమార్, రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపిద్దాం

నెల్లిమర్ల: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రతిఒక్కరూ నడుం కట్టాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. కొత్తపేట గ్రామంలో ఆమె శనివారం పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

● **భోగాపురం:** రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జనసేన, టీడీపీ, బీజేపీ ప్రభుత్వం రావల్సిందేనని నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. కవులవాడలో ఆమె శనివారం పర్యటించారు. గ్లాసు గుర్తుపై ఓటేసి తమకు మద్దతు తెలపాలని కోరారు. జన సైనికులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: టీడీపీలో చేరినవారితో జగదీశ్వరి



నెల్లిమర్ల: ప్రచారం చేస్తున్న మాధవి

త్యాగశీలి పొట్టి శ్రీరాములు

● ఘనంగా అమరజీవి జయంతి

త్యాగశీలి పొట్టి శ్రీరాములు అని వక్తలు కొనియాడారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. విజయనగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దీపికా పాటిల్.. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. (ఆంధ్రజ్యోతి బృందం)



విజయనగరం క్రైం: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ దీపిక



రాజాం: నివాళులర్పిస్తున్న ట్రైనీ డీఎస్పీ మహేంద్ర



కలెక్టరేట్: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



పాలకొండ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



గరుగుబిల్లి: నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకుడు మధుసూదనరావు



గుమ్మలక్ష్మీపురం: గురుకుల పాఠశాలలో..



తెర్లాం: గ్రంథాలయంలో..

ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే

పాలకొండ: ఎన్నికలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు ఆదేశించారు. స్టేటస్టిక్ సర్వే బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీస్, రెవెన్యూ సిబ్బందితో ఆయన శనివారం పాలకొండలోని తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్గ నిర్దేశం చేశారు. కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లోగా ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రాజకీయ నేతల పోస్టర్లు, కటౌట్లు తొలగించాలని సూచించారు. ● **భామిని:** ఎన్నికల నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని తహసీల్దార్ శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. శనివారం ఎన్నికల కోడ్ ప్రకటించడంతో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజా ప్రతినిధుల పోస్టర్లను గ్రామాల్లో ఎక్కడ ఉన్నా తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ● **బొండపల్లి:** ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో హరిహరరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి సమావేశం నిర్వహించి, పలు సూచనలు అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫ్లెక్సీలు, జెండాలు తొలగించాలని ఆదేశించారు. రాజకీయ నాయకుల విగ్రహాలను కవర్లతో కప్పివేయాలని సూచించారు.

విగ్రహాలకు ముసుగులు

కొమరాడ: ఎన్నికల ప్రక్రియ మొదలుకావడంతో ఎన్నికల కోడ్ శనివారం మధ్యాహ్నం నుంచి అమలు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మండలంలో ఉన్న వివిధ పార్టీల నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగులు తొడిగారు.



రాజకీయ నాయకుడి విగ్రహానికి ముసుగు తొడిగిన దృశ్యం

పోలింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలి

నెల్లిమర్ల: పోలింగ్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని నెల్లిమర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజు సూచించారు. శనివారం స్థానిక డ్వామా భవనంలో ఎన్నికల నిబంధనలపై బీఎల్వోలకు, ఎన్నికల అధికారులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శత శాతం ఓటు హక్కు వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో భోగాపురం సీఐ బీటీ వెంకటేశ్వరరావు, నాలుగు మండలాల ఎస్ఐలు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరఘట్టం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈఈ బాలాజీ తెలిపారు. పాలకొండ 133/33 కేవీ మెయింటెన్స్ పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

లోక్‌అదాలత్‌తో సత్వర పరిష్కారం

పాలకొండ: లోక్ అదాలత్‌తో సమస్యలు సత్వర పరిష్కారం అవుతాయని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాతల్‌ను నిర్వహించారు. వివిధ రకాలైన 320 కేసులు పరిష్కరించినట్టు పేర్కొన్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ● **కురుపాం:** కురుపాంలో స్థానిక కోర్టులో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో 6 కేసులు పరిష్కరించినట్టు లోక్ అదాలత్ చైర్మన్ ఎ.రమేష్ తెలిపారు. ఏపీపీ చంద్రకుమార్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.



పాలకొండ: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

కళాశాలల్లో బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్స్

పాలకొండ: పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వేమూరు హరగోపాల్ శనివారం బాధ్యతలు చేపట్టారు. జోన్-1 పరిధిలో పలువురు జూనియర్ లెక్చరర్లకు ఇంటర్ కమిషనర్ శుక్రవారం పదోన్నతులు కల్పించారు. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న హరగోపాల్, పదోన్నతిలో భాగంగా పాలకొండ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా చేరారు. ఇప్పటివరకు పైల శంకరరావు ప్రిన్సిపాల్‌గా కొనసాగారు. ● **జియ్యమ్మవలస:** ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సవరపు రవణ నియమితులయ్యారు. ఈయన గతంలో నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ● **భామిని:** భామిని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్‌వీఎల్ నారాయణరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమదాలవలస జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకునిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ప్రిన్సిపాల్‌గా ఇక్కడ చేరారు. ● **పాలకొండ:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలికలు) ప్రిన్సిపాల్‌గా బి.రేణుక శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈమె కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్రం అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

ఇన్విజిలేటర్లతో సమావేశాలు

సాలూరు రూరల్: టెన్త్ పరీక్షల నిర్వహణపై జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఇన్విజిలేటర్లతో చీఫ్ సూపరింటెండెంట్లు, డీవోలు సమావేశాలు నిర్వహించారు. పరీక్షలను ఏ విధంగా నిర్వహించాలి.. ఇన్విజిలేటర్లు వ్యవహరించాల్సిన తీరు, పరీక్ష విధానం వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

● ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయిదేవి

సాలూరు: చిన్న వయస్సులోనే వివాహాలు జరుగుతున్నట్లు గమనించానని, వాటిని అరికట్టాలని ఆర్జేడీ జి.చిన్మయిదేవి అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బంగారమ్మకాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శనివారం సందర్శించారు. అనంతరం సీడీపీవో కార్యాలయానికి వచ్చిన ఆమె స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. బంగారమ్మ కాలనీలో మైనర్ వివాహాలు అధిక సంఖ్యలో జరిగినట్లు గుర్తించానని చెప్పారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను ప్రశ్నించానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సత్యవతి, బొబ్బిలి సీడీపీవో విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్జేడీ చిన్మయిదేవి

తల్లీ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

సాలూరు(పాచిపెంట): గర్భిణులు, బాలింతలు, తల్లీ బిడ్డల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మాయిదేవి తెలిపారు. కోస్టువలసలో శనివారం నిర్వహించిన పోషణ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తల్లి గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వరకు సంరక్షణ చాలా కీలకమన్నారు. అనంతరం సీమంత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, సీడీపీవో బి.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

సరిహద్దులో వాహన తనిఖీలు

కొమరాడ: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ఆంధ్రా సరిహద్దు కూనేరులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం నుంచి ఒడిశా నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కొమరాడ తహసీల్దార్ రమేష్‌కుమార్ ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ప్రతిఒక్కరూ నడుచుకోవాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కారును తనిఖీ చేస్తున్న దృశ్యం

జియ్యమ్మవలస తహసీల్దార్‌కు అస్వస్థత

జియ్యమ్మవలస: తహసీల్దార్ డీవీ సీతారామయ్య స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. శనివారం ఉదయం కార్యాలయానికి వచ్చిన ఆయన ఉన్నట్టుండి కింద పడి స్పృహ కోల్పోయారు. దీంతో ఆయనను సిబ్బంది స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుడు జగదీష్ ఆయనకు చికిత్స అందించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు.

ఘనంగా పది విద్యార్థుల వీడ్కోలు

మక్కువ: కాశీపట్నం కేజీబీవీలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారికి పెన్నులు, ప్లాంకులు అందించారు. ఎస్‌వో జి.నాగదుర్గ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి శిర్లిపోతన్న మహోత్సవాలు

పాలకొండ: పట్టణంలోని శిర్లిపోతన్నవీధిలో వెలిసిన శిర్లపోతన్న, ఎల్లమ్మతల్లి యాత్రా మహోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భక్తులందరూ స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.



పోతన్న విగ్రహం

ఆరోగ్య సమస్యలు గుర్తించాలి

● డీఎంవో జగన్మోహనరావు

కొమరాడ: మారుమూల గిరిజన గ్రామాల ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి, సత్వరమే చికిత్స అందజేసేలా సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు ఆదేశించారు. కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీని ఆయన శనివారం సందర్శించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఆరోగ్య పరీక్షల వివరాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఓపీ రికార్డులు తనిఖీ చేశారు. ల్యాబ్‌లో జ్వర నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలను పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ, తదితర జ్వరాలు నమోదైతే క్షేత్రస్థాయిలో ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారు.. నివారణ చర్యల వివరాలపై తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షించి, ఆరోగ్య సర్వే ఏమేరకు చేపడుతున్నారని ఆయా సెక్రటేరియల్ గ్రామాలవారీగా ఆరా తీశారు. వెల్‌నెస్ కేంద్రాల సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు ఆరోగ్య సర్వే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, డాక్టర్ బి.శామ్యూల్, సీహెచ్‌వో బంగారుబాబు, వైద్య సిబ్బంది ఉన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంవో

హడావుడిగా ప్రారంభోత్సవాలు

గజపతినగరం: స్థానిక కూరగాయల బజార్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని చిరువ్యాపారులు ఎన్నేళ్లుగా కోరినా పట్టించుకోని పాలకులు, అధికా రులు.. ఎన్నికల కోడ్ వస్తుందని హడావిడిగా శనివారం ఉదయం శాశ్వత షెడ్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. జడ్పీటీసీ గార తవుడు, ఉప ఎంపీపీ కర్రి శ్రీదేవి, గ్రామ సర్పంచ్ నరవ కొండమ్మ, ఎంపీడీవో జయింతి ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

దత్తిరాజేరు: ఇంగిలాపల్లి జంక్షన్ నుంచి గదబవలస గ్రామం వరకు, పి.లింగాలవలస జంక్షన్ నుంచి వీరసాగరం గ్రామం వెళ్లేవరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు, జడ్పీటీసీ రౌతు రాజేశ్వరి శనివారం శంకుస్థాపన చేపట్టారు. మాజీ జడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున, వైస్ ఎంపీపీలు భమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో భూమి పూజ

బొబ్బిలి: పట్టణంలోని వివాదాస్పద స్థలంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు శనివారం భూమి పూజ చేశారు. స్థానిక తారక రామా కాలనీ ఎదురుగా జూట్‌మిల్లు పక్కన ఓ బందను కప్పేసి అక్కడ ఓ సామాజిక వర్గ సంక్షేమ భవనం నిర్మాణానికి భూమి పూజ చేశారు. శనివారం మధ్యాహ్నం ఎన్నికల కోడ్ వస్తుందని తెలియగానే ఉదయం హడావిడిగా భూమి పూజ చేశారు. వాస్తవానికి చెరువులు, బందలకు చెందిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టడం నిషేధం. అయినప్పటికీ దీనికి ఎంపీ బెల్లాన భూమి పూజ చేయడమే కాక, తన వంతుగా విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డి సత్యారావు, సంఘ అధ్యక్షుడు ఉంగట్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులు కబ్జా చేసి సంక్షేమ భవనం కడతారా?

బొబ్బిలి: చెరువులు, బందలు, ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన ప్రభుత్వ పెద్దలు నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలకు పూనుకోవడం ఏమిటని వామపక్షాల నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక జూట్‌మిల్లు పక్కనగల బందలో ఓ సామాజికవర్గ సంక్షేమ భవన నిర్మాణం కోసం భూమి పూజ చేయడాన్ని సీపీఎం, సీపీఐ నాయకులు పొట్నూరు శంకరరావు, కోట అప్పన్న తప్పుపట్టారు. నిర్మాణ స్థలంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకులు ఓట్ల కోసం కుల రాజకీయాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. వైసీపీ ప్రభుత్వ తీరుతో అలజంగిలో పొట్నూరు లక్ష్మునాయుడు అనే ఉపసర్పంచ్ ఆత్మహత్యకు పాల్పడ్డారని.. అప్పుడు ఆ వర్గం పెద్దలంతా ఏమయ్యారని ప్రశ్నించారు. దీనిపై సోమవారం ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో రైతు కూలీ సంఘ నాయకుడు వెలగాడ కృష్ణ, డీవైఎఫ్ఐ నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా దృష్టి సారించాలని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు సూచించారు. శనివారం మరుపెంట పంచాయతీ, తులసిరామినాయుడువలసలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా పారిశుధ్య నిర్వహణ పనులు నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి భార్గవ్‌నాయుడు పాల్గొన్నారు.

పప్పు మిల్లుల పంపిణీ

సాలూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఐఎఫ్ఎస్ (ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం) పైలెట్ ప్రాజెక్ట్ గ్రామాల్లో గిరిజన రైతులకు ఏఈవో ఎం.నాగేశ్వరరావు శనివారం పప్పు మిల్లులను పంపిణీ చేశారు. రేగాపువలస, మెట్టవలస, గంగన్నదొరవలస లో గిరిజన రైతులకు వీటిని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు సాగుతో పాటు వ్యవసాయ అనుబంధ పనులతో అధిక ఆదాయం ఆర్జించాలన్నారు.

నందబలగలో స్పెల్‌బీ పోటీలు

తెర్లాం: నందబలగ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి పాఠశాల స్థాయి ఆంగ్ల భాషా పదసామర్థ్యాన్ని పరీక్షించే స్పెల్‌బీ పోటీలను ప్రారంభించామని డెల్టా అధ్యక్షుడు ఎం.విజయమోహనరావు తెలిపారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పి.సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. ఈ నెల 31న జరిగే రెండు స్థాయిల పోటీల్లో ఎంపికైన వారిని స్పెల్‌బీ ప్రిన్స్, స్పెల్‌బీ ప్రిన్సెస్ అవార్డులతో సత్కరిస్తామని తెలిపారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, యు.ప్రసాద్, టి.అప్పారావు, జి.లక్ష్మి, ఎం.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తులతో స్వయం ఉపాధి

రేగిడి: చేతివృత్తులు, అల్లికలు నేర్చుకోవటంతో మహిళలు స్వయం ఉపాధి సాధించవచ్చని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు పేర్కొన్నారు. చిన్నశిర్లాం గ్రామంలో శనివారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, నీతిఆయోగ్ ఆధ్వర్యం లో జ్యూట్ ఉత్పత్తుల తయారీపై 18 నుంచి 35 ఏళ్లలోపు మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో బొత్స గురినాయుడు మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ పీవో రవికిరణ్, శిక్షకురాలు కె.మల్లీశ్వరి, మండల స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ గణపతి, ఉప్పరనాయుడువలసకు చెందిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు

నేడు గంట్యాడ ఎల్లమాంబ సిరిమానోత్సవం

గంట్యాడ: గంట్యాడ ఎల్లమాంబ సిరిమానోత్సవం ఆదివారం జరగనున్నది. అందుకు సంబంధించి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాది మహా శివరాత్రి వెళ్లిన 9 రోజుల తర్వాత ఆనవాయితీ ప్రకారం గంట్యాడ ఎల్లమాంబ సిరిమానోత్సవం నిర్వహిస్తుంటారు. జాతర సందర్భంగా ఆలయానికి రంగులు వేశారు. ఎస్.కోట మండలం వేములాపల్లి గ్రామం నుంచి సిరిమాను చెట్టును తీసుకుని వచ్చిన సంగతి తెలిసిందే. సిరిమాను చెట్టును స్థానిక విశ్వబ్రాహ్మణులు చెక్కి సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం సిరిమానోత్సవం ప్రారంభం కానున్నది. ● బుడతనాపల్లి గ్రామంలో ఎల్లమాంబ తీర్థ మహోత్సవం ఆదివారం జరగనున్నది. సిరిమానోత్సవం, తీర్థ మహోత్సవంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

ఒడిశా

రాయగడ: విద్యార్థులు క్రమశిక్షణతో నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలను చేరుకోగలరని వక్తలు అన్నారు. పితామహల్‌లోని సెంచూరియన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఫార్మసీ విద్యార్థులకు చివరి సంవత్సరం శనివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా జర్మన్‌కు చెందిన మ్యూనిచ్ యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డా.హెర్‌బాట్ రిప్పల్, కేంబ్రిడ్జి స్కూల్ చైర్మన్ సురేష్ మహాపాత్ర, సెంచూరియన్ రాయగడ ప్రాంతీయ సంచాలకులు డా.రాజేష్‌కుమార్ పాఢి తదితరులు పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు సమాజంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలంటే నిరంతరం కృషి చేయాలన్నారు. కెమిస్ట్రీ ప్రొఫెసర్ డా.రిపుల్.. వైద్య రంగంలో పరిశోధనలు ఎలా చేయాలో, వివిధ వ్యాధులకు వ్యాక్సిన్లు ఎలా కనిపెట్టడం అనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ముగ్గురికి గాయాలు

గంట్యాడ: వసాది గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.కోట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన పచ్చిపులుసు ఈశ్వరరావు తన భార్య రమాదేవి కలిసి ద్విచక్రవాహనంపై విజయనగరం వస్తున్నారు. అదే రహదారిలో ఒక శుభ కార్యక్రమానికి వెళ్లి, తిరిగి ఎస్.కోట వైపు ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు వస్తున్నారు. వసాది గ్రామ సమీపంలో కొత్తవెలగాడ కూడలిలో మలుపు వద్దకు వచ్చేసరికి రెండు వాహనాలు ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఈశ్వరరావు (53) అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్య రమాదేవి తీవ్రంగా గాయపడ్డారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అలాగే మరో ద్విచక్ర వాహనంపై ఉన్న జామి మండలం తానవరం గ్రామానికి చెందిన బుత్తల మహేష్, ఎస్.కోట మండలం వెంకటరమణపేట గ్రామానికి చెందిన ఎం.శివ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఎస్.కోటకు చెందిన 108 వాహనంపై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేంద్రనాయుడు ఘటనా స్థలం వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య



అనిల్‌కుమార్ (ఫైల్)

బొబ్బిలి: తండ్రి మందలించాడని కలత చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గోకివాడ గ్రామానికి చెందిన నామా అనిల్ కుమార్ (30) బొబ్బిలి మండలం కొత్తపెంట గ్రామానికి తల్లిదండ్రులతో కలిసి నాలుగునెలల క్రితం బెల్లం క్రషర్ దగ్గర పనులకు వచ్చాడు. ఆ పని పూర్తవడంతో తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ లోగా తమవద్ద ఉన్న ఒక ఆవును స్థానికులకు రూ. 50 వేలకు అనిల్‌కుమార్ అమ్మేశాడు. రూ.56 వేల విలువచేసే చేసే ఆవును ఎందుకు తగ్గించి అమ్మావని తండ్రి బుచ్చిరాజు ఆ యువకుని మందలించాడు. దీనికి కలత చెందిన అనిల్ కుమార్ శుక్రవారం బొబ్బిలి ఫ్లైఓవర్ సమీపంలో పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని కొత్తపెంట గ్రామంలో గల తన బావ అభిమన్యుకు ఫోన్‌లో తెలిపాడు. వెంటనే తండ్రి, బావలు అనిల్‌కుమార్‌ను బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ, కాకినాడ ఆసుపత్రులకు తరలించారు. కాకినాడలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు సమాచారం అందిందని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

చెట్టు మీద నుంచి పడి వ్యక్తి మృతి



నారాయణరావు (ఫైల్)

రామభద్రపురం: నాయుడువలస గ్రామానికి చెందిన మత్స నారాయణరావు (46) చెట్టు మీద నుంచి పడి శనివారం మృతి చెందినట్టు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. గ్రామంలో ఒక చింతచెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా కాలుజారి కిందకు పడడంతో తలకు బలమైన గాయాలు తగిలాయని తెలిపారు. వెంటనే బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు తెలిపారు. మృతుడు హైదరాబాద్‌లో షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూ సెలవుపై సొంత గ్రామం వచ్చినట్టు బంధువులు తెలిపారు. హెచ్‌సీ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భోగాపురంలో చోరీ..

భోగాపురం: భోగాపురం గ్రామంలోని ఓ ఇంట్లో శనివారం చోరీ జరిగింది. బాధితుడు వరుపుల వాసుదేవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాసుదేవరావుకు భోగాపురంలో ముడంతస్తుల గృహం ఉంది. కిందన ఓ వ్యక్తి నివాసం ఉండగా, మధ్యలో వాసుదేవరావు, పై అంతస్తులో వాసుదేవరావు తమ్ముడు రాము నివాసం ఉంటున్నారు. ఈనెల 14న వాసుదేవరావు అత్తగారింటికి మామిడిపల్లి వెళ్లారు. శనివారం వేకువజామున పైఅంతస్తులో ఉంటున్న రాము కిందకు దిగి వస్తుండగా రెండో అంతస్తులోగల ఇంటి తాళాలు పగులుకొట్టి, తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించాడు. లోపలకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. దీంతో అన్నయ్య అయిన వాసుదేవరావుకు సమాచారం ఇచ్చాడు. ఆయన వచ్చి చూడగా, బీరువాలో ఉన్న హారం, పిల్లల బంగారు ఆభరణాలు సుమారు 8తులాల బంగారం చోరీకి గురయినట్లు గుర్తించారు. దీంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ ఎ.రవికుమార్ క్లూస్ టీంను తీసుకొచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

చేతబడి అనుమానంతో వ్యక్తిపై దాడి..

సీతంపేట: సీతంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఉప్పరజమ్మి గ్రామానికి చెందిన కొండగొర్రె రామస్వామిపై చేతబడి అనుమానంతో అదే గ్రామానికి చెందిన బిడ్డిక కర్రయ్య, బిడ్డిక శ్రీను దాడి చేశారనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జగదీష్‌నాయుడు శనివారం తెలిపారు. ఈ దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేశామని చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవులు పట్టివేత

సీతంపేట: బలద సంత నుంచి అక్రమంగా తరలిస్తున్న 33 ఆవులను పెందుర్తి గోశాలకు తరలించామని ఎస్ఐ తెలిపారు. ఈ ఆవులకు ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్నారని, వారిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

తల్లీకొడుకు అదృశ్యం..

సీతంపేట: మండలంలోని దీసరిగూడ గ్రామానికి చెందిన తన భార్య, కొడుకు ఈనెల 12న అదృశ్యమైనట్టు భర్త దుర్గారావు శనివారం సీతంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో నిందితునికి జైలు శిక్ష

విజయనగరం క్రైం: భోగాపురం మండలానికి చెందిన మహిళపై అత్యాచారానికి యత్నించిన నిందితునికి మూడున్నరేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ విజయనగరం ఏడీజే న్యాయాధికారి ఎన్.పద్మావతి శనివారం తీర్పు వెల్లడించినట్టు దిశ మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి డీఎస్పీ డి.విశ్వనాథ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఓ గ్రామానికి చెందిన మహిళ భర్త ఉపాధి కోసం విజయవాడ వెళ్లగా.. ఆమె స్థానికంగా అప్పడాల కంపెనీలో పని చేసుకుంటూ ఇద్దరు పిల్లలతో ఒంటరిగా గ్రామంలో ఉంటోంది. అదే ప్రాంతానికి చెందిన చిల్లా ఈశ్వరరావు గత ఏడాది ఏప్రిల్ 29న అర్ధరాత్రి ఆ మహిళ ఉంటున్న ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారానికి యత్నించినట్టుగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దిశ పోలీసు స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ కేటీఆర్ లక్ష్మీ కేసు నమోదు చేశారు. అప్పటి దిశ ఇన్‌స్పెక్టర్ ఎం.శేషు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితుడు చిల్లా ఈశ్వరరావుపై నేరారోపణలు రుజువు కావడంతో ఐదో ఏడీజే, మహిళా కోర్టు న్యాయాధికారి ఎన్. పద్మావతి శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి..

బొబ్బిలి: స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలో రైలు శనివారం రైలు ఢీకొని తామాడ అప్పలస్వామి (66) అనే వృద్ధుడు మృతిచెందాడు. బొబ్బిలి జీఆర్‌పీ హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం బాడంగి మండలం ఆనవరం గ్రామానికి చెందిన అప్పలస్వామి గొల్లాదిలో పెళ్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. బొబ్బిలిలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొన్న ఘటనలో మృతి చెందాడు. స్థానికులు గుర్తించి బంధువులకు విషయాన్ని తెలియజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ ఈశ్వరరావు తెలిపారు.

25 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు..

రేగిడి: చిన్నశిర్లాం జంక్షన్‌లో శనివారం 25 మద్యం సీసాలతో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. పెద్దశిర్లాం కు చెందిన నిందితుడు బెల్ట్‌షాపునకు తరలిస్తున్న మద్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఆయన వెంట ఏఎస్ఐ మన్మథరావు, సిబ్బంది సుధీర్ తదితరులు ఉన్నారు.

పూరిల్లు దగ్ధం..

తెర్లాం: స్థానిక ఇందిరాకాలనీలో ఒక పూరిల్లు శుక్రవారం రాత్రి దగ్ధమైంది. వీఆర్‌వో శకుంతల తెలిపిన వివరాల మేరకు చింతాడ నారాయణమ్మకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. ఇరుగుపొరుగు వారు స్పందించి.. మంటలను అదుపుచేసి వృద్ధురాలి ప్రాణాలను కాపాడారు. తన దుస్తులు, సామగ్రి మంటలలో కాలిపోయాయని బాధితురాలు తెలిపింది.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

విజయనగరం క్రైం: విజయనగరం సర్కిల్‌లోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసినట్టు సీఐ కె.కృష్ణ తెలిపారు. తెర్లాం మండలం బూరిపేట, మెరకముడిదాం మండలం బుదరాయవలస గ్రామాల్లో విద్యుత్ చౌర్యం చేస్తున్న నిందితుల నుంచి రూ.లక్షా 3 వేల 548 అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్టయితే 08922-234579 నెంబరుకు సమాచారం అందించాలని సీఐ కృష్ణ తెలిపారు.

ప్రజల ఆశీస్సులే గెలిపిస్తాయి

● బొబ్బిలి టీడీపీ అభ్యర్థి బేబీనాయన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు

బొబ్బిలి: ప్రజల ఆశీస్సులే తనని గెలిపిస్తాయని బొబ్బిలి టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. బొబ్బిలి కోటలో శనివారం సాయంత్రం ఎన్నికల శంఖారావం పూరించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో బేబీనాయన ప్రసంగిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. 2005లో మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు తాను చేయించుకున్న ఓ శస్త్రచికిత్స వికటించడంతో పూనేలో మళ్లీ చేయించుకోవాల్సి వచ్చిందని.. ఆ సమయంలో 40 రోజుల పాటు ఆసుపత్రిలో నరకయాతనకు గురయ్యానని అన్నారు. తాను చనిపోయినట్లు అంతా ప్రచారం జరిగిపోయిందన్నారు. ఆ సమయంలో తన తల్లి, అన్న సుజయ్‌లు చేసిన సేవలు మరువరానివన్నారు. బొబ్బిలి ప్రాంత ప్రజలు, అభిమానులు సర్వమత ప్రార్థనలు చేసి తనను బతికించుకున్నారన్నారు. ఆ కృతజ్ఞతతో తాను ఎమ్మెల్యేగా గెలిచి రుణం తీర్చుకోవాలని తపన పడుతున్నానన్నారు. రాష్ట్రాన్ని రావణకాష్టంగా చేసిన జగన్ నుంచి జనాన్ని కాపాడుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.200 కోట్లతో రోడ్లు మంజూరు చేస్తే.... వైసీపీ ఐదేళ్ల పాలనలో 30 శాతం కూడా పూర్తి చేయలేకపోయారని ఆరోపించారు చంద్రబాబు-పవన్‌కల్యాణ్‌ల నాయకత్వంలో రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉందన్నారు. మోడీ మళ్లీ పీఎం కావడం ఖాయమని అన్నారు. ఎత్తిపోతల పథకాల కోసం లోచర్ల నుంచి తెర్లాం మీదుగా ఆమిటి వరకు పాదయాత్ర చేస్తానని బేబీనాయన ప్రకటించారు. గొల్లాది బ్రిడ్జి, వెంగళరాయసాగర్ జలాల కోసం నారసింహునిపేట-పాతబొబ్బిలి-కోమటిపల్లి మీదుగా కలవరాయి వరకు పాదయాత్ర చేస్తానని తెలిపారు. మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు మాట్లాడుతూ తమ అన్నదమ్ముల మధ్య ఎటువంటి విభేదాలు లేవన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పార్టీ బాధ్యతలు అప్పగించినందున తాను అక్కడ బిజీగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, నాయకులు నర్సుపల్లి వెంకటనాయుడు, రౌతు రామ్మూర్తి, అల్లాడ భాస్కరరావు, చింతల రామకృష్ణ, సుంకరి సాయిరమేష్, బొంతు త్రినాథ, జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, పెద్దింటి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు..

బొబ్బిలి: బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి స్థానిక కోటలో బేబీనాయన, సుజయ్‌కృష్ణరంగారావు సమక్షంలో టీడీపీలో చేరారు. జగన్నాథపురం మాజీ సర్పంచ్ కనిమెరకల గౌరమ్మ, రమణ, పీఏసీఎస్ సభ్యుడు పొట్నూరు అప్పారావు, శీరాపు రాములు తదితరులను బేబీనాయన కండువాలు వేశారు. రామభద్రపురం మండలం పాడివానివలస తదితర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు.



టీడీపీలో చేరిన వారితో అదితి గజపతిరాజు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న బేబీనాయన

టీడీపీలో చేరిక..

విజయనగరం రూరల్: ముడిదాం, గొల్లలపేట గ్రామాలకు చెందిన మజ్జి శివ, చిట్టి ఆదినారాయణ, చెల్లూరు గౌరీశంకర్, తిరుపతిరావుతో పాటు 80 కుటుంబాల వారు వైసీపీని వీడి, శనివారం టీడీపీలో చేరారు. వీరందరికీ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, ఈగల సత్యారావు యాదవ్, పడగల రామకృష్ణ, నగర నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన శని వదిలిపోయింది..

రాజాం: రాష్ట్రానికి పట్టిన శని శనివారంతో పోయిందని టీడీపీ నాయకులు అన్నారు. ఎన్నికల షెడ్యూలు విడుదల చేయడంతో నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకున్నారు. మందుగుండ సామగ్రి కాల్చి వైసీపీ ప్రభుత్వానికి నేటితో ముగింపు కావాలని పలువురు అన్నారు. ఈ రాష్ట్రానికి పట్టిన దుష్టశక్తుల నుంచి విముక్తి లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో గురవాన నారాయణరావు, డి.శ్రీనివాసరావు, నంది సూర్యప్రకాష్‌రావు, టంకాల కన్నంనాయుడు, పొన్నాడ భీమేశ్వరరావు, ఆటో కోటి తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా కాల్చుతున్న టీడీపీ అభిమానులు

మహనీయుల విగ్రహాల ఏర్పాటు వేగవంతం



విగ్రహాల ఏర్పాటుకు విరాళం అందించిన సోము రాంబాబును సత్కరిస్తున్న సంఘ నేతలు

విజయనగరం దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని సీఎంఆర్ సమీపంలోని పెద్దచెరువు ప్రాంగణంలో మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కాన్షీరామ్, జ్యోతిరావు పూలే విగ్రహాల ఏర్పాటు ప్రక్రియ వేగవంతంగా సాగుతోందని అంబేద్కర్ రైట్స్ ప్రతినిధులు పాండ్రంకి వెంకట రమణ తెలిపారు. శనివారం ఈ విగ్రహాల ఏర్పాటు ప్రాంతానికి దళిత, బహుజన, ప్రజా సంఘాలు ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుకు సుమారు రూ.20 లక్షలను బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు విరాళంగా అందించారన్నారు. ఈ కార్యక్రమంలో గంట్లాన అప్పారావు, వీర్రాజు, ఆర్జి శివప్రసాద్, దుర్గారావు, మహేంద్ర, రవి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జామి ఎల్లమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: జామి ఎల్లమ్మ జాతరకు ఆదివారం శృంగవరపుకోట, కొత్తవలస నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఉదయం 5.30 నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులను పెంచుతామన్నారు. జామి నుంచి కొత్తవలసకు రూ.30 టిక్కెట్ వసూలు చేస్తున్నామన్నారు.

బేబీనాయన సొంత నిధులతో బోర్‌వెల్

తెర్లాం, మార్చి 16: టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన సొంత నిధులతో నెమలాం గ్రామంలో బోర్‌వెల్‌ను నిర్మించారు. వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ బోరును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బేబీనాయనకు గ్రామస్థులు ధన్యావాదాలు తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

రేగిడి: దేవుదళ కస్తూరిబా గాంధీ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్ ఒకేషనల్ కంప్యూటర్ సైన్స్ కోర్సులకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మురపాక లక్ష్మి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ రెండు తరగతులకు చెరో 40 సీట్లు ఉన్నాయని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 12 నుంచి వచ్చేనెల 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జీతాలు చెల్లించేందుకు కమిషనర్ హామీ

విజయనగరం దాసన్నపేట: నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు చెల్లించేందుకు కమిషనర్ మల్లంనాయుడు హామీ ఇచ్చినట్టు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ (సీఐటీయు) ప్రతినిధి జగన్మోహన్ తెలిపారు. శనివారం కమిషనర్ మల్లంనాయుడు, డీఈ అప్పారావు, కాంట్రాక్టరు రామప్రసాద్‌తో యూనియన్ ప్రతినిధులు చర్చించారు. 2023 జూలై నుంచి సీఎంఎఫ్‌లో పెండింగ్‌లో ఉన్నాయని.. అవి మంజూరయ్యేలోగా ప్రత్యామ్నాయ ఆలోచన చేసి జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. యూనియన్ నాయకులు మురళి, అరుణ్, అప్పారావు, సన్యాసిరావు, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఓట్లపై విచారణ చేపట్టండి

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ పరిధిలోని 94వ పోలింగ్ కేంద్రంలో ఒకే ఇంటి నెంబరుతో 69 ఓట్లు ఉన్నాయని... వీటిపై సమగ్ర సర్వే చేయాలని టీడీపీ నాయకులు మైలిపిల్లి పైడిరాజు, ఏఏ రాజు, మైలిపిల్లి వాసుదేవరావులు ఆర్‌డీఓ సూర్యకళకు వినతిప్రతం సమర్పించారు. తప్పులు లేని ఓటర్ల జాబి తాను రూపొందించి.. పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా చూడాలని కోరారు.

కొండగంగుబూడి విద్యార్థికి గేట్‌లో ర్యాంక్



చాణుక్య విహార్

వేపాడ: కొండగంగుబూడి గ్రామానికి చెందిన చల్లా జగన్ కుమారుడు చాణుక్య విహార్ గేట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 898వ ర్యాంకు సాధించాడు తల్లిదండ్రులు చల్లా జగన్, జ్యోతితో పాటు గ్రామస్తులు ఆ విద్యార్థిని అభినందించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే..



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ

శృంగవరపుకోట: ఎన్నికల నియామవళిని ప్రతి ఒక్కరూ పాటించా లని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ స్పష్టం చేశారు. శనివారం రాత్రి స్థానిక తహసీల్దార్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిరణ్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. 24 గంటల్లోగా ప్రభుత్వ ఆస్తులపై అన్ని రకాల వాల్ రైటింగ్‌లు, పోస్టర్‌లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్ లు, జెండాల వంటివి తొలగించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీకైనా అనుకూలంగా వ్యవహరించినా... ఎన్నికల ప్రచారా ల్లో పాల్గొన్నా, బహుమతులు పొందినా క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్నికల ఏర్పాట్లలో అలసత్వం వద్దు

బాడంగి: రానున్న సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు అలసత్వం వహించకుండా పనిచేయాలని ఏఆర్వో రాజారావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో ఎలక్టోరల్ అధికారి ఆంజనేయులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న ఏఆర్‌వో రాజారావు

పేషెంట్ రిలేషన్ కోర్సులో ఉచిత శిక్షణ

గుజరాతీపేట: డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు పేషెంట్ రిలేషన్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ శిక్షణ ఎచ్చెర్లలో గల టీటీడీసీలో అందించనున్నట్టు స్పష్టం చేశారు. ఉచితంగా భోజన, వసతి సదుపాయంతో పాటు శిక్షణ పూర్తి చేసిన వారికి కార్పొరేట్ ఆసుప త్రుల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. 2023, అంతకుముందు ఇంటర్ బైపీసీ పాసైన వారికి ఈ విద్యాసంవత్స రంలో బీఎస్సీ పారా మెడికల్ కోర్సులో ఉచితంగా అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 76809 45357 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు జెమ్స్ క్యాంపస్‌లోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం: బొద్దాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ సురేష్‌బాబు, ఏడీ మాధవరావు, ఏఈ సురేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. బొద్దాం, పెనుబాక, కొత్తవలస, మారెడుబాక, గెడ్డవలస, బొమ్మినాయుడువలస, ఇల్లంనాయుడువలస, నర్సింహపురం, బూరాడపేట, ఎం.జోగివలస, గారాజు చీపురుపల్లి, సోపేరు, కొఠారిపురం, నందబలగ, లక్ష్మీపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బీటీ రోడ్డు ప్రారంభం

బాడంగి: పినపెంకి, ఆనవరానికి వెళ్లే బీటీ రోడ్డును ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శంబంగి వేణు గోపాలనాయుడు, ఈదుబిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు ముక్కలవ్వడం ఖాయం

బాడంగి: వైసీపీ ఫ్యాన్ రెక్కలు ముక్కలవ్వడం ఖాయమని విజయనగరం పార్లమెంట్ టీడీపీ బీసీ సాధికారిత కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఓ ప్రకటనలో వ్యాఖ్యానించారు. రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించిందని, మరో 45 రోజుల్లో ఏపీ ప్రజలకు పూర్తిస్వేచ్ఛ లభిస్తుందని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి అయిదేళ్ల విధ్వంసక పాలన వల్ల రాష్ట్రం అన్ని విధాలా నాశనమైందన్నారు. చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

క్షయ వ్యాధిపై అవగాహన

లక్కవరపుకోట (కొత్తవలస): చీడివలస గ్రామంలో శనివారం క్షయవ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో టీబీపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, కఫం, బరువు తగ్గడం, ఆకలి వేయకపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. టీబీ వ్యాధికి ప్రభుత్వం అత్యాధునిక మందులు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, హెచ్ఎస్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి సభను విజయవంతం చేయండి

విజయనగరం దాసన్నపేట: గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఆదివారం జరగనున్న టీడీపీ, జనసేన, బీజేపీ బహిరంగ సభకు జిల్లా నుంచి భారీ ఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో అంధకారమైన ఆంధ్ర రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ఎన్‌డీఏ కూటమి సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు ఇమంది సుధీర్, మజ్జి రమేష్, సోము మహేష్ సురేష్ రెడ్డి, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డ్వాక్రా సంఘాల సమావేశాలు

విజయనగరం రూరల్: టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు విజయనగరంలో డ్వాక్రా సంఘాల సమావేశాలు జరుగుతున్నాయి. శనివారం 12, 15, 16 డివిజన్లకు చెందిన డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ మహిళా విభాగం నాయకులు కంది శమంతకమణి, అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి, ఉండ్రాళ్ల వెంకట లక్ష్మి, వీరలక్ష్మి, వేలిచేటి మణికుమారి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. మహిళలంతా రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇవ్వాలని టీడీపీ మహిళా నేతలు పిలుపునిచ్చారు.

మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

శృంగవరపుకోట: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం స్థానిక ఆకుల డిపో వద్ద విశాఖ పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మతుకుమిల్లి శ్రీభరత్ సహకారంతో హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్, ఎన్టీఆర్ సేవా సమితి, ఎం.వి. ఎస్‌మూర్తి ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. క్యాన్సర్‌తో పాటు సాధారణ, కంటి, చిన్నపిల్లలు, దంత, చర్మ, స్త్రీ సంబంధ వ్యాధుల గుర్తింపునకు పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన లలిత కుమారి మాట్లాడుతూ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిన ప్రభుత్వం డాక్టర్‌లను అందుబాటులో ఉంచకుండా నర్సింగ్, ఏఎన్ఎం, వలంటీర్ల ద్వారా వైద్య పరీక్షలు చేయిస్తోందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వైద్య రవాణా వాహనాలు, ఫీడర్ అంబులెన్సులు తిరిగి ప్రవేశపెడతామన్నారు. ఈ శిబిరంలో 500 మందికి పరీక్షలు చేసి.. 30 రకాల వ్యాధులకు పరీక్షలు, ఉచిత మందులు అందించామన్నారు. మెరుగైన వైద్య పరీక్షలు అవసరమయ్యే వారికి ఆదివారం గీతం ఆస్పత్రికి తరలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామ ప్రసాద్, నాయకులు లాలం అర్జునరావు, జి.ఎస్.నాయుడు, రెడ్డి వెంకన్న, నానిగిరి రమణాజీ, కొణదం మల్లేశ్వరరావు, కోళ్ల శ్రీను, కొట్టాన విజయ్, సంఘం సతీష్, సాగర్ కల్యాణ్, కాపుగంటి వాసు, చల్ల వెంకటరావు, లగుడు తిరుపతి, పోతనాపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.